www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:87 WEDNESDAY , AUGUST 12, 2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 87 బుధవారం 12 ఆగష్టు 2026 పేజీలు :8 వెల: 4/-


## ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



( ఆగస్టు -11- హింస కలంవార్త )

క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు.. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026ను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి) లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మిగతా2లో

# డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

( ఆగస్టు -11- హింసకలం వార్త )



పెట్టుబడులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేయాలి సీఎం రేవంత్‌రెడ్డి అంతర్జాతీయ ప్రమాణాలతో సదస్సు నిర్వహణకు కార్యాచరణ ప్రముఖ పారిశ్రామిక వేత్తలకు సన్మానం గత పెట్టుబడుల పై సమగ్ర నివేదికకు ఆదేశం తెలంగాణలో మరిన్ని భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచస్థాయి పారిశ్రామిక వేత్తలు, పెట్టు బడిదారులను ఆకర్షించేలా సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు పటిష్ట మైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సదస్సు సన్నద్ధత పై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి సమర్థవంతం గా పరిచయం చేసేలా కార్యక్రమాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. వివిధ పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖుల ను సదస్సు సందర్భంగా సన్మానించేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. మిగతా2లో

## POB రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించొద్దు



### దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి

### దరఖాస్తులను నేరుగా కలెక్టర్లకు పంపాలి

హింసకలం వార్త :నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దని మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యాని ంచారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మాటిచ్చారు. మంగళవారం హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి కలెక్టర్లతో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. కొత్తగా ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు. 22ఏ దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. భూ రెగ్యులరైజేషన్‌కు మిగతా2లో



## నేతాజీ అస్థికల తరలింపు

### కుమార్తె పిటిషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

- నేతాజీ అస్థికలను జపాన్ నుంచి భారత్‌కు తీసుకురావాలని పిటిషన్
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేతాజీ కుమార్తె అనితా బోస్ పఫ్
- పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు
- గతంలో ఇదే అంశంపై దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించిన ధర్మాసనం

హింసకలం వార్త :స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భౌతిక అవశేషాలను జపాన్ నుంచి భారత్ కు తీసుకువచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఆయన కుమార్తె అనితా బోస్ పఫ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని మిగతా2లో

## తెలంగాణను హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



హింసకలం వార్త :హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. మిగతా2లో

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం

## ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం



2లో

హింసకలం వార్త :స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్ర మంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలు పునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు.

## సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



**సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ**

**టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ**

**కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి**

**రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు**

హింసకలం వార్త :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. మిగతా2లో

## 'కేరళ' ఇకపై 'కేరళం'





### కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర

### కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు

హింసకలం వార్త :కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రి యలో మరో కీలక ఘట్టం పూర్తయింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున మిగతా2లో



## పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే

**భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్య అన్న వీహెచ్**

**భారతరత్న ఇవ్వడం ద్వారానే ఆయనకు నిజమైన గౌరవం లభిస్తుందని వ్యాఖ్య**

**పింగళి సేవలను మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అని ప్రశ్న**

హింసకలం వార్త :భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంక య్యకు అత్యున్నత పౌర పురస్కార మైన 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహా దారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు డిమాండ్ చేశారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో మిగతా2లో

# డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

**గత పెట్టుబదుల పై సమగ్ర నివేదిక**

గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, ఆయా సంస్థలు ప్రకటించిన ప్రాజెక్టుల పురోగతి, ఇప్పటివరకు జరిగిన పెట్టుబడుల అమలు పరిస్థితిపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గత సదస్సు ఫలితాలను విశ్లేషించి, ఈసారి మరింత పెద్ద స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించే విధంగా వ్యూహాన్ని రూపొందించాలని సూచించారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుమతులు, ఇతర ప్రభుత్వ సేవలను వేగంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ వేదికపై విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు.

**పారిశ్రామిక రంగానికి మరింత ఊతం**

ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, డేటా సెంటర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్, ఆరోగ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి వివిధ రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలను సదస్సు ద్వారా ప్రపంచ పెట్టుబడిదారులకు వివరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా నిలబెట్టేలా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా, డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించే అవకాశాలపై కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు ఇటీవల నివేదికలు వెలువడ్డాయి. ఫ్యూచర్ సిటీని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ ప్రణాళికల నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రాధాన్యత పెరుగుతోంది.

**ప్రపంచ పెట్టుబడిదారులకు తెలంగాణ ఆహ్వానం**

దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వ్యాపార సంస్థలు, పారిశ్రామిక రంగ ప్రతినిధులను సదస్సుకు ఆహ్వానించి తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించాలని ప్రభుత్వం భావిస్తోంది. భారీ పెట్టుబడుల ద్వారా కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, హైదరాబాద్‌లోని బలమైన ఐటీ, లైఫ్ సైన్సెస్, పారిశ్రామిక మౌలిక వసతులను ప్రపంచ పెట్టుబడిదారులకు వివరించేందుకు సదస్సు కీలక వేదికగా నిలవనుంది. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష





ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లను సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రీడా వేదికల సిద్ధత, మౌలిక వసతుల కల్పన, క్రీడాకారులు, కోచ్‌లు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, రవాణా, వసతి, భద్రత తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో యువ క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం అధికారులకు సూచించినట్లు సమాచారం. క్రీడా వేదికలను అవసరమైన ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేయడంతో పాటు, పోటీల నిర్వహణలో వివిధ శాఖల మధ్య సమన్వయం కీలకమని సమావేశంలో చర్చించారు. క్రీడాకారులకు నాణ్యమైన వసతి, ఆహారం, వైద్య సదుపాయాలు, రవాణా వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోటీలు సజావుగా జరిగేలా ప్రతి విభాగానికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించి, ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వంటి జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణ ద్వారా తెలంగాణలో క్రీడా రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. యువతలో క్రీడల పై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, రాష్ట్రానికి చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. సమీక్ష సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎస్ ఏ టి జి చైర్మన్ శివసేనా రెడ్డి, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్ ఏ టి జి ఎండీ సోనీబాల దేవి తదితరులు పాల్గొన్నారు.

# POB రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించొద్దు

22ఏ/సాదీ దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. భూ రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్లన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ నెల 14వ తేదీలోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో పెట్టాలని దిశానిర్దేశం చేశారు. ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టేందుకే ఆన్‌లైన్ విధానం అమల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలకు చెక్ పెడుతున్నామని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల ఆధారంగానే రిజిస్ట్రేషన్లపై నిర్ణయం తీసుకుంటామని చెప్పుకొచ్చారు.

**POB దరఖాస్తులను నేరుగా కలెక్టర్లకు పంపాలి..**

సాదీ దరఖాస్తులను ఇక తహసీల్దార్లకు కాకుండా నేరుగా కలెక్టర్లకు పంపాలని మంత్రి పొంగులేటి సూచించారు. రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించొద్దని ఆదేశించారు. తిరస్కరణకు కారణాలు తెలిపేందుకు మూడు రోజుల సమయం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదని స్పష్టం చేశారు. అర్హులకు అన్యాయం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్లకు ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్గదర్శకాలు జారీ చేశారు.

# తెలంగాణను హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నామన్నారు .ఉదయం 7 గంటలకు హైదరా బాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. హెచ్‌ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్‌ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్‌ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. రేపు ఈ ర్యాలీని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్.. జెండా ఊపి ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొననున్నారు.

# 'కేరళ' ఇకపై 'కేరళం'..

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

# పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే

భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్యకు అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిన త్రివర్ణ పతాకాన్ని అందించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడికి భారత ప్రభుత్వం ఇవ్వగల ఏకైక సముచితమైన నివాళి భారతరత్న మాత్రమేనంటూ ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 'హర్ ఘర్ తిరంగా' పిలుపును స్వాగతిస్తూనే... జాతీయ జెండా రూపకర్త విషయంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యాన్ని వీహెచ్ ఎండగట్టారు. దేశమంతటా త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతున్నప్పుడు, దానికి ప్రాణం పోసిన తెలుగు నేల ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య సేవలను ప్రధాని మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదని ఘాటుగా ప్రశ్నించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న ఇస్తేనే ప్రతి భారతీయుడికి, సమరయోధుల త్యాగాలకు సరైన గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. గతంలోనే తాను హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పటికైనా కేంద్రం స్పందించి ఈ మహత్తర నిర్ణయం తీసుకోవాలని లేఖలో కోరారు.

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

# నేతాజీ అస్థికల తరలింపు..

స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భౌతిక అవశేషాలను జపాన్ నుంచి భారత్‌కు తీసుకువచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఆయన కుమార్తె అనితా బోస్ పఫ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, విదేశాంగ, హోం మంత్రిత్వ శాఖలకు నేడు నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. నేతాజీ కుమార్తె తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 28వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. దశాబ్దాలుగా జపాన్ రాజధాని టోక్యోలోని రెంకోజీ ఆలయంలో భద్రపరిచిన నేతాజీ అస్థికలను భారత్‌కు తీసుకురావాలని పిటిషన్‌లో కోరారు. నేతాజీ కుమార్తెగా, చట్టబద్ధమైన వారసురాలిగా తనకు ఈ అంశాన్ని కోర్టు ముందు ప్రస్తావించే హక్కు ఉందని అనితా బోస్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం ఇదే అంశంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో నేతాజీ సోదరుడి మనవడు ఆశిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనమే విచారించడానికి నిరాకరించింది. ఆ సమయంలో పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరిన న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, నేతాజీ కుమార్తె నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారని తెలిపారు. ఆనాటి విచారణలో నేతాజీకి ఏకైక చట్టబద్ధమైన వారసురాలు అనితా బోస్ అని, ఆమె కూడా అస్థికలను వెనక్కి తీసుకురావాలనే కోరుకుంటున్నారని సింఘ్వీ వాదించారు. అయితే, "వారసురాలు పిటిషనర్‌గా లేరు. వారే స్వయంగా మా ముందుకు రావాలి. తెర వెనుక ఉండి పోరాటం చేయలేరు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. నేతాజీ కుటుంబ సభ్యుల భావోద్వేగాలను గౌరవిస్తామని, అయితే చట్టపరమైన ప్రక్రియను సంబంధిత వారసులే ప్రారంభించాలని అప్పుడు సూచించింది. కోర్టు సూచనల మేరకే తాజాగా అనితా బోస్ పిటిషన్ దాఖలు చేయడంతో ధర్మాసనం విచారణకు స్వీకరించి కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. తన తండ్రికి దేశంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు వీలుగా అస్థికలను తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆమె తన పిటిషన్‌లో ఆరోపించారు.

# సంపాదకీయం

## పురపాలక చట్టాలను సవరిస్తేనే రిజర్వేషన్లకు న్యాయం!




పట్టణ స్థానిక సంస్థలైన నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలలో చైర్‌పర్సన్, మేయర్ పోస్టులకు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతులు, మహిళలకు రిజర్వేషన్ కల్పించిన మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 123 పట్టణ స్థానిక సంస్థలలో 4 షెడ్యూల్డు తెగలకు, 17 షెడ్యూల్డు కులాలకు, 40 వెనుకబడిన తరగతులకు కేటాయించారు. ఆయా స్థానిక సంస్థలలో ఉన్న మొత్తం సీట్లలో-- రిజర్వేషన్లతో కూడా కలిపి 50 శాతానికి తగ్గకుండా మహిళలకు కేటాయించాలని నిబంధనలు చెబుతున్నాయి. అలాగే, నగర పంచాయతీలు, మునిసిపాలిటీలలో వార్డు మెంబర్లకు, నగరపాలక సంస్థలలో కార్పొరేటర్ల పదవులకు రొటేషన్ పద్ధతిన రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం--1965, సవరించిన ఆంధ్రప్రదేశ్ నగరపాలక సంస్థల చట్టం--1994 ప్రకారం... పట్టణ స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలనే నిబంధనలు లేకపోయినా, 74వ, భారత రాజ్యాంగ సవరణ చట్టం 'ఆర్టికల్ 243--టి' ప్రకారం నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలలో ఆయా ప్రత్యేక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారు.

ప్రస్తుతం జీవో 59, తేది 10.09.2021 ప్రకారం, రాష్ట్రంలోని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలలో రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. అదే విధంగా జీవో 60, తేది 10.09.2021ని అనుసరించి ప్రస్తుతం నగరపాలక సంస్థలలో ఆయా కేటగిరీలకు చెందినవారికి రిజర్వేషన్లు కేటాయిస్తున్నారు. ఈ రిజర్వేషన్లు ఆయా వర్గాల జనాభాకు తగినట్లుగా దామాషా ప్రకారం రొటేషన్ పద్ధతిలో ఉండాలనీ, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనీ అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు తెలియజేస్తున్నాయి.

పట్టణ స్థానిక సంస్థలలో చైర్‌పర్సన్, మేయర్ పోస్టులకున్నట్టుగా వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ పోస్టులకు రిజర్వేషన్లు లేని కారణంగా, అసలు రిజర్వేషన్ పాలసీ అనే దానికే అర్థం లేకుండాపోతోంది. ఎందుకంటే-- ఏదైనా ఒక మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ సీటు షెడ్యూల్డు కులాలకు కేటాయించినప్పుడు, ఏదైనా కారణంతో... అంటే చైర్‌పర్సన్ అనారోగ్యం లేదా పదవికి రాజీనామా చేయటం వంటి కారణాల వల్ల ఆ పదవికి తాత్కాలికంగా ఖాళీ ఏర్పడితే, ఆ పదవిలో కూర్చునే వ్యక్తి షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తే అయివుండాలి. అలాగే, షెడ్యూల్డ్ తెగలకు, వెనుకబడిన కులాలకు, మహిళలకు కేటాయించిన చైర్‌పర్సన్ పోస్టుల విషయంలో కూడా, ఆయా పదవులకు తాత్కాలికంగా ఖాళీ ఏర్పడితే, ఆయా వర్గాలకు సంబంధించిన వ్యక్తులే ఆ పదవులను అలంకరించాలి. కానీ, వాస్తవ పరిస్థితులలో అలా జరగటం లేదు.రాష్ట్రంలో చాలా పట్టణ స్థానిక సంస్థలలో రిజర్వేషన్ విధానం సక్రమంగా అమలు జరగటం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానంలో ఆయా వర్గాలకు చెందనివారు, మహిళల స్థానంలో పురుషులు అధికారం పంచుకుంటున్నారు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకం, ఆయా వర్గాల వారికి అన్యాయంగా భావించాల్సి ఉంటుంది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలలో చట్టాలను ఏనాడో సవరించుకున్న ఫలితంగా అక్కడ డిప్యూటీ మేయర్ పదవికి కూడా మేయర్ పదవికి చెందిన కేటగిరీ ననుసరించి రిజర్వేషన్ వర్తిస్తుంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పట్టణ స్థానిక సంస్థల చట్టాలు సవరణకు నోచుకోకపోవటంతో రిజర్వేషన్ స్ఫూర్తికి భంగం కలుగుతోంది. నిజానికి మన రాష్ట్రంలో కూడా 2021లో వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ పదవులకు రిజర్వేషన్ కల్పించే ప్రయత్నం జరిగింది. అయితే, ఆ రిజర్వేషన్లు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా కాకుండా చట్ట సవరణ ద్వారానే జరగాలనే కారణంతో అప్పటి ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. అదే సంవత్సరం జూలైలో జారీ చేసిన జీవో 66 ద్వారా మున్సిపాలిటీలలో ఇద్దరు వైస్ చైర్‌పర్సన్‌లు, నగరపాలక సంస్థలలో ఇద్దరు డిప్యూటీ మేయర్లను ఎన్నుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ పదవుల విషయంలో పైన తెలిపిన పరిస్థితులు మారి, ఆయా వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగాలంటే ప్రస్తుత చట్టాలను సవరించాలి. అప్పుడే రాజ్యాంగం ద్వారా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన వర్గాల మహిళలకు ప్రత్యేకంగా కేటాయించిన రిజర్వేషన్లు పక్కాగా అమలు అవుతాయి. దీంతో రిజర్వేషన్ల వెనకున్న అసలు ఉద్దేశ్యం పూర్తిగా నెరవేరుతుంది. ఈ సంవత్సరాంతంలో జరగనున్న ఎన్నికలలోనైనా ప్రతి పట్టణ స్థానిక సంస్థలలోనూ రెండో అత్యున్నత ప్రజాప్రతినిధి పదవికి కూడా ప్రత్యేక రిజర్వేషన్‌ను అమలుచేసి, ఆయా వర్గాలకు సముచితమైన అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాలి. అప్పుడే రాష్ట్రంలోని నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు నగరపాలక సంస్థల పాలనా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుంది.

# అంతిమ పరిష్కారం-'నీట్' రద్దు!







ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పేరుతో జెన్ జీ యువత, విద్యార్థులు ఇటీవల ఒక అపూర్వ నిరసన చేపట్టారు. ఆ ఆందోళన ఫలితంగా కాలవాహినిలో మరుగున పడిన వివిధ అంశాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. వాటిలో ఒకటి-- 'నీట్' రద్దు; మరొకటి-- 'విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి రాష్ట్రాల జాబితాలోకి తిరిగి చేర్చడం'.వైద్యవిద్యా కోర్సులు ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్‌లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే 'నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్' (నీట్)ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాటి నుంచీ అది వివాదాస్పదంగానే ఉన్నది. వైద్య విద్యలో శిక్షణ కోసం రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల వల్ల అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో పాటు విద్యార్థులపై విపరీతమైన ఆర్థిక భారం పడి, వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నందున జాతీయ స్థాయిలో ఒకే విధమైన ప్రవేశ పరీక్ష ఉండాలని కొందరు నిపుణులు సూచించారు. వైద్య విద్యలో ప్రవేశించడానికి అవసర మయ్యే అర్హతా పరీక్ష జాతీయ స్థాయిలో ఒకేవిధంగా ఉండాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) సైతం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ సూచనల మేరకు కేంద్రం 2013లో వైద్య విద్యకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష 'నీట్'ను ప్రవేశపెట్టింది. అయితే, అప్పటి నుంచి ఈ ఏడాది వరకు 5 సార్లు 'నీట్' నిర్వహణలో పలు అక్రమాలు సంభవించాయి. ఆ అవకతవకలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. వైద్య ప్రవేశ పరీక్షను పూర్తిగా రద్దు చేసి తిరిగి నిర్వహించిన సందర్భాలు... గతంలో 2015లో AIPMT విషయంలో, తాజాగా 2026లో నీట్ విషయంలో చోటుచేసుకున్నాయి. ఇది గమనార్హమైన వాస్తవం. 'నీట్'కు ప్రతి ఏటా హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య సగటున 21 లక్షలు ఉంటుండగా, వారిలో 11 నుంచి 13 లక్షల మంది దాకా అర్హత సాధిస్తున్నారు. వీరిలో కేవలం 1 లక్షా 10 వేల నుంచి 1 లక్షా 25 వేల మంది వరకూ ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో ప్రవేశం పొందుతున్నారు. అంటే, 'నీట్' రాసిన వారిలో సీట్లు పొందేవారి సంఖ్య కేవలం 6 శాతంగా మాత్రమే ఉంటోంది.

విధానపరంగా చూసినప్పుడు జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించడం అన్నది సముచితంగా కనిపిస్తోంది. అయితే 'నీట్' నిర్వహణలో అనేక లోపాలు, వైరుధ్యాలు ఉన్నాయనేది ఒక వాస్తవం. లక్షలాది విద్యార్థుల జీవితాలతో ముడివడి ఉన్న 'నీట్'ను లోపరహితంగా నిర్వహించలేకపోవడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోంది. ఈ ఏడాది (2026) 'నీట్' పరీక్ష రద్దు కావడంతో 12 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. జీవితాన్ని పణంగా పెట్టి కష్టపడి చదివే విద్యార్థులకు పేపర్ లీకేజీ వంటి అక్రమాలు అశనిపాతంగా పరిణమిస్తున్నాయి. పరీక్ష రద్దు కావడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికిలోనై కుప్పకూలిపోతున్నారు. రెండోసారి ఫీజు లేకుండా పరీక్ష నిర్వహించి నప్పటికీ.. అందుకు చాలామంది విద్యార్థులు సన్నద్ధం కాలేకపోవడం ఓ చేదు వాస్తవం.'నీట్'ను రద్దు చేయాలన్న డిమాండ్ ఊపందుకోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే పరీక్షా పత్రాల లీకేజీలు, ఇతర అక్రమాల వంటివి మాత్రమే కాకుండా అసలు ఈ పరీక్షను నిర్వహిస్తున్న తీరే దేశ సమాఖ్య వ్యవస్థను సవాల్ చేసే విధంగా ఉండటం ప్రధానంగా కనిపిస్తోంది. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ దేశంలోని 22 భాషల్ని అధికారికంగా గుర్తించింది. అయితే ఆశ్చర్యకరంగా 'నీట్' ప్రశ్న పత్రం 13 భాషల్లో మాత్రమే ఉంటుంది. దేశవ్యా ప్తంగా ఉన్న విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించడానికే 'నీట్' అని చెప్పే కేంద్ర ప్రభుత్వం ఈ లోపాన్ని ఎలా సమర్థించుకుంటుంది? ఈ 13 భాషలలో ప్రవేశం లేని విద్యార్థులు తమకు రాని ఏదో ఒక భాషలో లేదా ఇంగ్లీషును ప్రత్యామ్నాయంగా ఎంచుకొని అందులో పరీక్ష రాయాలి. అంటే, 'నీట్'లో 9 భాషల విద్యార్థులకు ఎంత అన్యాయం జరుగుతుందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ సరిపోతుంది. 'నీట్'నురద్దు చేయాలన్న డిమాండ్ ఊపందుకోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే పరీక్షా పత్రాల లీకేజీలు, ఇతర అక్రమాల వంటివి మాత్రమే కాకుండా అసలు ఈ పరీక్షను నిర్వహిస్తున్న తీరే దేశ సమాఖ్య వ్యవస్థను సవాల్ చేసే విధంగా ఉండటం ప్రధానంగా కనిపిస్తోంది. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ దేశంలోని 22 భాషల్ని అధికారికంగా గుర్తించింది. అయితే ఆశ్చర్యకరంగా 'నీట్' ప్రశ్న పత్రం 13 భాషల్లో మాత్రమే ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించడానికే 'నీట్' అని చెప్పే కేంద్ర ప్రభుత్వం ఈ లోపాన్ని ఎలా సమర్థించుకుంటుంది? ఈ 13 భాషలలో ప్రవేశం లేని విద్యార్థులు తమకు రాని ఏదో ఒక భాషలో లేదా ఇంగ్లీషును ప్రత్యామ్నా యంగా ఎంచుకొని అందులో పరీక్ష రాయాలి. అంటే, 'నీట్'లో 9 భాషల విద్యార్థులకు ఎంత అన్యాయం జరుగుతుందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ సరిపోతుంది.

'నీట్'లో మరో కీలకమైన లోపం ఏమంటే ప్రశ్న పత్రాన్ని 'సీబీఎస్ఈ' సిలబస్‌ను ఆధారం చేసుకొని రూపొందిస్తున్నారు. విద్యార్థుల్లో అత్యధికులు తమ రాష్ట్రంలో అమలు చేసే రాష్ట్ర సిలబస్‌ను మాత్రమే చదువుతారు. అంటే, 'నీట్'కు హాజరవుతున్న సీబీఎస్ఈ సిలబస్ విద్యార్థులకు ఇతరుల కంటే అదనపు ప్రయోజనం ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'నీట్' రద్దు చేయాలని మొదటి నుంచీ పలు విధాలా పోరాటం చేస్తున్న తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం '2021లో వైద్య విద్యా ప్రవేశాలపై ఆ జాతీయ ప్రవేశ పరీక్ష ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి 'ఏకే రాజన్' కమిటీని ఏర్పాటు చేసింది. కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందేవారికే 'నీట్'లో దాదాపు 90 శాతం సీట్లు లభిస్తున్నాయని, 'నీట్' అన్నది వేల కోట్ల రూపాయల విద్యా వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారిందని, మెడికల్ డాక్టర్ కావాలనుకుంటున్న పేద, వెనుకబడిన వర్గాల హక్కులను, ప్రయోజనాలను ఇది కాలరాస్తోందని ఏకే రాజన్ కమిటీ నివేదిక వెల్లడించింది. మరి ఈ పరిస్థితుల్లో ఒక ప్రశ్న సహజంగానే సర్వత్రా చర్చకు వస్తోంది: 'విద్య అన్నది విద్యార్థి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం కోసం నేర్చుకునేదా? లేక విజ్ఞానం, నైపుణ్యాలు సముపార్జించి, తద్వారా ఉపాధి పొందే మార్గంగా ఎంచుకునేదా?' 'నీట్' పరీక్ష లేనప్పుడు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వైద్య విద్యన భ్యసించి అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడి ప్రసిద్ధ వైద్యులుగా భారతీయులు ఎంతో పేరు గడించారని కొందరు గుర్తు చేస్తున్నారు. గల్ఫ్ దేశాలలో, ఇంగ్లాండ్‌లో ఉన్న వైద్యులలో 20శాతం మంది భారతీయులేనని గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంతేకాదు, 'నీట్' మొదలయ్యాక గత కొన్నేళ్లుగా దేశంలో వైద్య విద్యనభ్యసించే విద్యార్థులలో తగిన ప్రమాణాలు లేవన్న విమర్శ కూడా వినిపిస్తోంది.

పలు రాష్ట్రాలు, ప్రత్యేకించి ఈశాన్య ప్రాంత రాష్ట్రాలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన బిహార్, రాజస్థాన్ మొదలైనవి కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే సంక్షేమ కార్యక్రమాలు కొనసాగి స్తున్నాయి. ఈ రాష్ట్రాలపై ఆర్థిక భారం తగ్గించడం కోసమే కీలకమైన 'విద్య'ను రాష్ట్రాల జాబితా నుంచి తొలగించి 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి కేంద్రం ఇతోధికంగా రాష్ట్రాలకు నిధులు అందిస్తూ వస్తోంది. ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి కేంద్రం 'సర్వశిక్షా అభియాన్' వంటి కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే, దేశంలో ప్రతి రాష్ట్రానికీ తమదైన ప్రత్యేక భాషా సంస్కృతులు ఉన్న నేపథ్యంలో స్థానిక అవసరాల రీత్యా అవసరమైన విద్యా వ్యవస్థను, విద్యా విధానాన్ని తమకు తాముగా రూపొందించుకునే స్వేచ్ఛ కోసం విద్యను రాష్ట్ర జాబితాకు బదలాయించాలని తమిళనాడు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఈ డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమైన సమాఖ్యవాద సూత్రాన్ని 'నీట్' ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ, ఆ జాతీయ ప్రవేశ పరీక్ష రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం 2023 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విద్యా విషయమై నిర్ణయాలు తీసుకునే రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని 'నీట్' హరించివేస్తోందని కూడా ఆ పిటిషన్‌లో తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా.. 'నీట్' పరీక్ష గ్రామీణ ప్రాంతాలు, రాష్ట్ర బోర్డు విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్నది కనుక అది రాజ్యాంగ అధికరణ 14 (చట్టం ముందు అందరూ సమానులే) ప్రకారం సమానత్వ హక్కును ఉల్లంఘిస్తోందని కూడా ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ఇంకా తుది తీర్పు వెలువరించలేదు. కేంద్రం, రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి రాజ్యాంగ అధికరణ 131 సుప్రీంకోర్టుకు అధికారాలు కల్పించింది. ఈ నేపథ్యంలో, సుప్రీం కోర్టు తీర్పు రాష్ట్రాలకు అనుకూలంగా ఉండవచ్చనే అభిప్రాయం న్యాయ వ్యవస్థ వర్గాలలో వ్యక్తమవు తోంది. అమెరికాతోపాటు పలు దేశాలలో విద్యను స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్రస్థాయి ప్రభుత్వాలే నిర్వహి స్తున్నాయి. ఫెడరల్ ప్రభుత్వాలు విద్యలో జోక్యం చేసుకోవు.

మన దేశంలో కూడా విద్యను రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు మార్చ వలసిన అవసరమున్నది. దీనివల్ల రాష్ట్రాలు గతంలో వలే తమ సొంత విధానాలు, ప్రమాణా లను నిర్ణయించుకోవడానికి, స్వయం ప్రతిపత్తితో పనిచేయడానికి అవకాశం లభిస్తుంది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ప్రస్తుతం దేశవ్యా ప్తంగా ఉన్న విద్యార్థులకు 'నీట్' వల్ల ఒకే ఒక్క అవకాశం ఉంటోంది. వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగిస్తే ఇతర రాష్ట్రాలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు వెళ్లే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది. విభిన్న నేప థ్యాల నుంచి వచ్చే విద్యార్థుల ప్రతిభకు అన్యాయం జరగదు. సామాజిక న్యాయానికి భంగం వాటిల్లదు. అదేవి ధంగా తక్కువ ప్రాతినిధ్యం ఉన్న సామాజిక వర్గాలకు రాజ్యాంగ పరంగా లభించిన రిజర్వేషన్ విధానం రాష్ట్రాల స్థాయిలో సమర్థంగా అమలవు తుంది. అంతేకాకుండా రాజ్యాంగం ప్రవచించిన సమాఖ్య విధానం పటిష్ఠమవడమే కాకుండా కేంద్ర రాష్ట్ర సంబంధాలు సామరస్యంగా ఉంటాయి. అందువల్ల నీట్ పరీక్షను రద్దు చేయడం, విద్య అంశాన్ని రాష్ట్రాల జాబితాకు బదలాయించడం అన్ని విధాలా శ్రేయస్కరం.

# అమ్మవారి ఒడిబియ్యం అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్న కొలుకుల జైహింద్





( ఆగస్టు - 11- హంస కలంవార్త )

రోడా మేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ లోని అమ్మవారి ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా భక్తులు సమర్పించిన ఒడి బియ్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి.ఆర్.ఎస్ నాయకులు కొలుకుల జైహింద్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నిర్వహించిన ఒడి బియ్యం అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జైహింద్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో బస్తీ ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. తెలంగాణ సాంప్రదాయంలో అమ్మవారి బోనాల పండుగ ఉత్సవాలు ఎంతో ప్రసిద్ధిగాంచినవని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ, నర్సింగ్, సంతోష్, మురళి, ప్రభాకర్, నాగరాజు, యాదగిరి, విగ్నేష్, సీతారాములు, ఖయ్యూం, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# యువతలో దేశభక్తి, జాతీయతా భావాలను పెంపొందిస్తూ దేశంకోసం ఘనంగా "రన్ ఫర్ వందేమాతరం" : వడ్డేపల్లి రాజేశ్వరరావు






( ఆగస్టు - 11- హంస కలంవార్త )

భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో, జాతీయ గీతం "వందేమాతరం" 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విశ్వహిందూ పరిషత్--బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "రన్ ఫర్ వందేమాతరం -- విద్యార్థి దళ్" కార్యక్రమం కూకట్‌పల్లిలో దేశభక్తి ఉత్సాహంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై యువత, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, దేశభక్తులు జాతీయ జెండాలను చేతబూని "వందేమాతరం", "భారత్ మాతాకీ జై" నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, యువతలో దేశభక్తి, జాతీయతా భావాలను పెంపొందించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత మత్తుపదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ, విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాల వైపు అడుగులు వేయాలని సూచించారు. "విద్యార్థి శక్తి -- దేశ శక్తి" అని పేర్కొంటూ, నేటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని అన్నారు. ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన, దేశభక్తి భావాలు కలిగిన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపు నిచ్చారు. వందేమాతరం వంటి దేశభక్తి గీతాలు భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో స్ఫూర్తిని, ఐక్యతను నింపాయని, అలాంటి జాతీయ భావాలను నేటి తరానికి చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షులు మోహన్ రావు , ప్రాంత సహాయ కార్యదర్శి రమేష్,బజరంగ్ దళ్ నిర్వాహకులు, బిజెపి నాయకులు జీవన్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ చారి, శివాచారి, మహేందర్,విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని "రన్ ఫర్ వందేమాతరం" కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మల్కాజ్గిరిలో బోనాలు మరియు ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న మైనంపల్లి హనుమంతరావు, మరియు డా. మైనంపల్లి రోహిత్







-హైదరాబాద్ బోనాలు మరియు ఫలహార బండి ఊరేగింపు ఉత్సవాలు మల్కాజ్గిరిలో ఘనంగా జరిగాయి.







( ఆగస్టు - 11- హంస కలంవార్త )

సీనియర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావు లి మరియు లిమెదక్ శాసన సభ్యులు డా. మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం జరిగిన ఫలహార బండి ఊరేగింపులో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండా లని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మ వారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మవారి బోనాల జాతరలో పాల్గొన్న బండి రమేష్

( ఆగస్టు - 11- హంస కలంవార్త )





శ్రీశ్రీశ్రీ తలుపులమ్మ తల్లి -- నీలమణి దుర్గమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించిన అమ్మవారి బోనాల జాతర కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లిబండి రమేష్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనం సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక ప్రతీక అని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సంతోషం, ఆరోగ్యం కలగాలని శ్రీ బండి రమేష్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ప్రశాంతి నగర్ డివిజన్ ప్రెసిడెంట్ చంద్రరావు, నాగార్జున, గొట్టుముక్కల వెంకటేశ్వ రరావు, వాసు, రమణ, పాల్గొన రావు, కామినేని వాసు తదితరులు పాల్గొన్నారు.

# అనవసరంగా కాంగ్రెస్ పార్టీలో చేరాను!

-మరోసారి రేవంత్ పై ఫిరాయింపు ఎమ్మెల్యే పోచారం తిరుగుబాటు
-కేసీఆర్‌ను మోసం చేసి పార్టీ మారడం ఇష్టం లేకుండే, కానీ తప్పలేదు
-కేసీఆర్ వల్లే అభివృద్ధి జరిగింది అని నేనే చెప్తున్నాను
-అన్నం పెట్టినోడిని మరవడం కష్టంగా ఉంది



( ఆగస్టు - 11- హంస కలంవార్త )

కొన్ని రాజకీయ పరిణామాల వల్ల పార్టీ మారాల్సి వచ్చింది నేను జాతీయ జెండాను మాత్రమే కప్పుకున్నాను, కాంగ్రెస్ జెండా కాదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు మంత్రులు లెక్క చేయడం లేదు నా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి భట్టికి, పొంగులేటికి చెప్పినా వాళ్లు పట్టించుకోలేదు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇస్తామని సీఎం చెబితేనే పార్టీలో చేరాను ఆరు నెలల్లో బాన్సువాడ నియోజకవర్గంలో ఉన్న పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని సీఎం చెబితేనే జాతీయ కండువా కప్పుకున్న మంత్రులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు పొంగులేటి, భట్టి సీఎం మాటలు వినడం లేదు మంత్రులు పట్టించుకోవడం లేదంట, నువ్వైనా నిధులు విడుదల చేయమని వేం నరేందర్ రెడ్డికి స్వయాన ముఖ్యమంత్రి చెబితే ఆయన కూడా పట్టించుకోలేదు వేం నరేందర్ రెడ్డికి 50 సార్లు ఫోన్ చేసినా ఫోన్ అటెండ్ చేయడం లేదు నవంబరులో ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సీఎం సమావేశం నిర్వహిస్తే రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించా నేను నీకు అమ్ముడుపోయానా నా ఎమ్మెల్యే పదవిని కొన్నావా అని అడిగాను.

## సి ఎస్ ఆర్ నిధులతో చెరువులను అభివృద్ధి చేద్దాం రండి



( ఆగస్టు -11- హంస కలంవార్త )




పలు సంస్థలకు ఎంఏ ఉ యు డి పిలుపు నగరంలోని చెరువులను సామాజిక బాధ్యతలో భాగంగా అభివృద్ధి చేసి, వాటి పునరుజ్జీవనానికి కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ( ఎంఏ ఉ యు డి ) పిలుపునిచ్చింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ( సి ఎస్ ఆర్ ) నిధులను వినియోగించి నగరంలోని చిన్న చెరువులను అభివృద్ధి చేసేందుకు సంస్థలు ముందుకు రావాలని అధికారులు కోరారు. చెరువుల అభివృద్ధి, పునరుజ్జీవనంలో కార్పొరేట్ సంస్థల భాగస్వా మ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ఎంఏఉ యుడి, స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో CSR రౌండ్ టేబుల్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఉ యు డి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెరువులు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో నగరానికి అవసరమైన నీటి వనరులను పరిరక్షించడంతో పాటు, భారీ వర్షాల సమయంలో వరదల నియంత్రణకు చెరువులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నగరంలో ఉన్న చిన్న చెరువులను కూడా సంరక్షించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా ఆధ్వర్యంలో ఇప్పటికే చేపట్టిన మొదటి, రెండో దశల చెరువుల అభివృద్ధి పనుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆయా దశల్లో చేపట్టిన పునరుద్ధరణ, అభివృద్ధి కార్యక్రమాల గురించి సంస్థల ప్రతినిధులకు వివరించారు. అదేవిధంగా హైడ్రా చేపట్టనున్న మూడో దశ చెరువుల అభివృద్ధి కార్యక్రమానికి కూడా ప్రభుత్వ ఆమోదం లభించినట్లు రంగనాథ్ తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగరంలోని చెరువులను దశలవారీగా అభివృద్ధి చేయడం, వాటిని సంరక్షించడం తమ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ఇందులో కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. సి ఎస్ ఆర్ నిధుల ద్వారా చిన్న చెరువుల అభివృద్ధికి సంస్థలు ముందుకు వస్తే నగర పర్యావరణ పరిరక్షణకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా నీటి వనరుల పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపొందించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడటం, వర్షపు నీటి నిర్వహణను మెరుగుపరచడం, వరదల ప్రభావాన్ని తగ్గించడం వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయని అధికారులు వివరించారు. ప్రభుత్వ సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలకు సి ఎస్ ఆర్ సంస్థలు తమ వంతు సహకారం అందిస్తే సుస్థిర హైదరాబాద్ నిర్మాణానికి మరింత బలమైన భాగస్వామ్యం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. నగర భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చని, నీటి వనరులతో కూడిన హైదరాబాద్‌ను అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## మృతుడి కుటుంబానికి హరీశ్ రావు ఆర్థిక సాయం



( ఆగస్టు -11- హంస కలంవార్త)

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామ పంచాయతీ పరిధిలోని శివాజీ నగర్ కు చెందిన గౌరబోయిన సంతోష్ తను ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. సంతోష్ ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. ఈ విషాద ఘటనతో సంతోష్ కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు సంతోష్ కుటుంబానికి అండగా నిలిచారు. తన తరఫున గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హరీశ్ రావు భరోసా ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. సంతోష్ కుటుంబానికి అండగా నిలిచిన మాజీ మంత్రి హరీశ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము కూడా ముందుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కమాల్ షరీఫ్, కోనేటి సత్యం, రంగు రాజు గౌడ్, పరమాండ్ల మల్లేశం, జాజాల చందు, ఎల రాజేంద్ర, కాటం రాజేశ్, బాలచారి, ఇజారుద్దీన్, జనార్ధన్, ముంద్రాతి యాదగిరి, ఈశ్వరయ్య, బిక్షపతి, గౌరబోయిన మల్లేశం, యాదగిరి, ఐలయ్య, రాజయ్య, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ శాఖ లో చిన్నారులు, వృద్ధుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

-సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

-వంటశాలలు, వసతి గదులు, పరిసరాల పరిశుభ్రతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి

-సుల్తానాబాద్ మండలంలోని సంక్షేమ సంస్థలు, బాల రక్ష భవన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

( ఆగస్టు -11- హంస కలంవార్త)



సంక్షేమ శాఖ లో వసతి పొందుతున్న చిన్నారులు, వృద్ధులకు మెరుగైన సౌకర్యాలు, భద్రత, అవసరమైన సంరక్షణ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని క్యాడర్ దివ్యాంగుల పాఠశాల, వృద్ధాశ్రమం, బాల సదనం పాఠశాల, మండల విద్యా వనరుల కేంద్రాన్ని, అలాగే పెద్దపల్లిలోని రంగంపల్లి బాల రక్షక భవన్‌ను జిల్లా కలెక్టర్‌ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సంస్థల్లోని వసతి సౌకర్యాలు, సిబ్బంది విధుల నిర్వహణ, చిన్నారులు, వృద్ధులకు అందుతున్న సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా వంటశాలలు, డార్మిటరీలనుజిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వంటశాలల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, పరిసరాల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గదుల్లో పరిశుభ్రత, తగిన సౌకర్యాలు, చిన్నారులు మరియు వృద్ధుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, అవసరమైన చోట తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. సిబ్బంది విధుల నిర్వహణపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రతి ఉద్యోగి నిర్ణీత సమయానికి విధులకు హాజరై, తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి స్థాయి బాధ్యతతో, సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా సంస్థల నిర్వహణపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.చిన్నారులు, వృద్ధుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వారి ఆరోగ్యం, భద్రత, ఆహారం, వసతి తదితర అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారి అవసరాలను గుర్తించి తక్షణమే పరిష్కరించే విధంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు.బాల రక్షక భవన్‌లోచిన్నారుల సంరక్షణ, రక్షణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. అక్కడ పనిచేస్తున్న ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సిబ్బంది బాధ్యతలను స్పష్టంగా నిర్వర్తించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.అనంతరం పోక్సో కేసులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలలపై లైంగిక వేధింపులు, హింస వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు బాధిత చిన్నారులకు సకాలంలో రక్షణ, అవసరమైన సహాయం, కౌన్సెలింగ్ తదితర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల రక్షక వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. భరోసా కేంద్రాలను కూడా పరిశీలించి బాలల రక్షణ, సంరక్షణకు సంబంధించిన కేసులను సున్నితంగా పరిగణించి, బాధితులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలల సంరక్షణకు సంబంధించిన ప్రభుత్వ సేవలు, రక్షణ వ్యవస్థలపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.బాలలపై జరిగే హింస, వేధింపులు, నిర్లక్ష్యం వంటి ఘటనలను గుర్తించి సంబంధిత వ్యవస్థల దృష్టికి తీసుకువచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, తద్వారా అవసరమైన ప్రతి కేసు అధికారుల దృష్టికి వచ్చి బాధిత చిన్నారులకు సకాలంలో రక్షణ, సహాయం అందించేందుకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ తనిఖీల్లో సంబంధిత శాఖల అధికారులు, సంస్థల నిర్వాహకులు, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

# మొబైల్‌కు బానిసవుతున్న బాల్యం”







( ఆగస్టు - 11- హంస కలంవార్త )

డిజిటల్ యుగంలో పిల్లల బాల్యాన్ని మింగేస్తున్న మొబైల్ అలవాటు కాలం మారింది.. టెక్నాలజీ మారింది.. జీవన విధానం మారింది. ఒకప్పుడు పిల్లలు బయటకు వెళ్లి ఆటలు ఆడేవారు. స్నేహితులతో కలిసి సమయం గడిపేవారు. పుస్తకాలు చదివేవారు. కుటుంబ సభ్యులతో మాట్లాడేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చిన్న పిల్లల చేతుల్లోనే స్మార్ట్‌ఫోన్లు కనిపిస్తున్నాయి. తల్లిదండ్రులు ఏ పని చెప్పినా "మొబైల్ ఇస్తే చేస్తాను" అనే పరిస్థితి కొన్ని ఇళ్లలో కనిపిస్తోంది. "మొబైల్ ఇస్తేనే అన్నం తింటాను.. మొబైల్ ఇస్తేనే చదువుతాను.. మొబైల్ ఇస్తేనే బయటకు వస్తాను.. మొబైల్ ఇస్తేనే పని చేస్తాను" అనే స్థాయికి కొంతమంది పిల్లల అలవాటు చేరుతున్నట్లు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ టెక్నాలజీ మన జీవితాన్ని సులభతరం చేసింది. విద్య, సమాచారం, కమ్యూనికేషన్, వినోదం వంటి అనేక రంగాల్లో మొబైల్ ఫోన్ ఉపయోగకరంగా మారింది. కానీ అవసరానికి మించి స్క్రీన్ ముందు గడిపే సమయం పిల్లల రోజువారీ జీవనశైలిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. మొబైల్ లేకుండా ఒక్క నిమిషం కూడా ఉండలేరా? చిన్న పిల్లలు మొబైల్ ఫోన్ అడగడం సాధారణంగా కనిపిస్తోంది. తల్లిదండ్రులు పని మీద ఉన్నప్పుడు పిల్లలను బిజీగా ఉంచేందుకు మొబైల్ ఇవ్వడం మొదలవుతుంది. మొదట కొన్ని నిమిషాలు.. తర్వాత కొంత సమయం.. ఆ తర్వాత రోజూ.. చివరికి మొబైల్ లేకుండా పిల్లలను నియంత్రించడం కష్టంగా మారే పరిస్థితి వస్తుంది. పిల్ల ఏడిస్తే మొబైల్.. అన్నం తినకపోతే మొబైల్.. చదవకపోతే మొబైల్.. బయటకు వెళ్లకుండా ఇంట్లో ఉండాలంటే మొబైల్.. తల్లిదండ్రులు పని చేసుకోవాలంటే మొబైల్..ఇలా ప్రతి సమస్యకు మొబైల్‌ను పరిష్కారంగా ఉపయోగించడం వల్ల పిల్లలకు మొబైల్ ఒక సాధారణ పరికరం నుంచి రోజువారీ జీవితంలో అత్యంత ముఖ్యమైన వస్తువుగా మారే ప్రమాదం ఉంది. తల్లిదండ్రుల ప్రేమ.. తెలియకుండానే అలవాటుగా మారుతోందిచాలా సందర్భాల్లో తల్లిదండ్రులు పిల్లలకు మొబైల్ ఇవ్వడం వెనుక చెడు ఉద్దేశం ఉండదు. "పిల్ల ఏడుస్తున్నాడు.. కాసేపు వీడియో చూస్తే నిశ్శబ్దంగా ఉంటాడు.""అన్నం తినడం లేదు.. వీడియో పెడితే తింటాడు." "నేను పని చేసుకోవాలి.. పిల్లాడు మొబైల్ చూస్తూ ఉంటే ఇబ్బంది ఉండదు." అని అనుకుంటారు. ఇది మొదట్లో సులభమైన పరిష్కారంలా కనిపించవచ్చు. కానీ అదే పద్ధతి ప్రతిరోజూ కొనసాగితే పిల్లలు మొబైల్ లేకుండా తమను తాము వినోదపరచుకోవడం, భోజనం చేయడం, ప్రశాంతంగా ఉండడం వంటి విషయాలను నేర్చుకోవడంలో ఇబ్బంది పడవచ్చు. "అన్నం తినాలంటే వీడియో కావాలి" అనే పరిస్థితి ఎందుకు? చాలా ఇళ్లలో పిల్లలకు భోజనం పెట్టేటప్పుడు మొబైల్‌లో వీడియోలు చూపించడం అలవాటుగా మారింది. పిల్ల మొబైల్ చూస్తూ భోజనం చేస్తాడు. తాను ఎంత తిన్నాడో కూడా గమనించకపోవచ్చు. తల్లిదండ్రులతో మాట్లాడే సమయం తగ్గుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసే అలవాటు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. భోజనం అనేది కేవలం ఆకలి తీర్చుకునే సమయం కాదు. కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు మాట్లాడుకునే సమయం కూడా. అందుకే సాధ్యమైనంత వరకు భోజన సమయంలో స్క్రీన్‌లకు దూరంగా ఉండే కుటుంబ వాతావరణాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. చదువుకు మొబైల్ అవసరం.. కానీ పరిమితి కూడా అవసరం డిజిటల్ టెక్నాలజీని పూర్తిగా తప్పుపట్టలేం. ఆన్‌లైన్ క్లాసులు, విద్యా వీడియోలు, డిజిటల్ పుస్తకాలు, నిఘంటువులు, విద్యా యాప్‌లు వంటి వాటి ద్వారా పిల్లలకు ఉపయోగకరమైన సమాచారం అందుబాటులోకి వచ్చింది. అందువల్ల సమస్య "మొబైల్ వాడుతున్నారా?" అనే ప్రశ్నలో లేదు.

అసలు ప్రశ్న--- "ఎందుకు వాడుతున్నారు? ఎంతసేపు వాడుతున్నారు? ఏ కంటెంట్ చూస్తు న్నారు? మొబైల్ వల్ల చదువు, నిద్ర, ఆటలు, కుటుంబ సమయం దెబ్బతింటున్నాయా?" అనేదే.మొబైల్ వల్ల తగ్గిపోతున్న కుటుంబ సంభాషణ ఒకే ఇంట్లో నలుగురు సభ్యులు ఉన్నా ఒక్కొక్కరి చేతిలో ఒక్కో స్క్రీన్ ఉంటే కుటుంబ సభ్యుల మధ్య సంభాషణ తగ్గిపోతుంది. తల్లిదండ్రులు మొబైల్‌లో.. పిల్లలు మొబైల్‌లో.. ఇంట్లో ఉన్నా ప్రతి ఒక్కరూ తమ తమ డిజిటల్ ప్రపంచంలో ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లలతో మాట్లాడటానికి సమయం కేటాయించడం చాలా ముఖ్యం. వారి పాఠశాల విషయాలు, స్నేహితులు, ఇష్టాలు, సమస్యలు, భయాలు, కలలు వంటి విషయాలను తల్లిదండ్రులు తెలుసుకోవాలి. బయట ఆటలు.. పిల్లల జీవితంలోకి మళ్లీ రావాలి ఒకప్పుడు పిల్లల బాల్యంలో ఆటస్థలం ఒక ముఖ్యమైన భాగం. ఇప్పుడు చాలా మంది పిల్లల ఖాళీ సమయం స్క్రీన్ ముందు గడుస్తోంది.పిల్లలు వయసుకు తగిన శారీరక కార్యకలాపాల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. సైకిల్ తొక్కడం, నడక, ఆటలు, కళలు, సంగీతం, పుస్తక పఠనం, కుటుంబంతో బయటకు వెళ్లడం వంటి ప్రత్యామ్నాయాలు పిల్లలకు అందుబాటులో ఉంటే స్క్రీన్‌పై ఆధారపడటం తగ్గించడంలో సహాయ పడవచ్చు. నిద్రకు ముందు మొబైల్.. మరో సమస్య రాత్రి పడుకునే ముందు చాలా సేపు స్క్రీన్ చూస్తే నిద్రకు సంబంధించిన సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. పిల్లలకు తగినంత నిద్ర ఎంతో అవసరం. అందువల్ల పడుకునే సమయానికి దగ్గరగా స్క్రీన్ వినియోగాన్ని తగ్గించే కుటుంబ నియమం పెట్టుకోవడం మంచిది. "పడుకునే ముందు మొబైల్ లేదు" అనే చిన్న నియమం కూడా పిల్లల రోజువారీ అలవాట్లలో మంచి మార్పు తీసుకురాగలదు. పిల్లలకు నియమాలు.. పెద్దలకు కూడా వర్తించాలి ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఉంది. తల్లిదండ్రులు పిల్లలకు "మొబైల్ చూడొద్దు" అని చెబుతూ, తాము మాత్రం గంటల తరబడి ఫోన్ చూస్తుంటే పిల్లలు ఆ మాటను సులభంగా స్వీకరించరు. పిల్లలు మనం చెప్పేది మాత్రమే కాదు.. మనం చేసేదాన్ని కూడా అనుసరిస్తారు. అందుకే ఇంట్లో స్క్రీన్ వినియోగానికి సంబంధించిన కొన్ని సాధారణ నియమాలను పెద్దలు కూడా పాటించాలి. పిల్లలకు ఆదర్శంగా నిలవడం.. వారికి ఇచ్చే అత్యుత్తమ డిజిటల్ విద్య. మొబైల్‌ను పూర్తిగా తీసేయడం పరిష్కారం కాదు పిల్లల చేతిలో మొబైల్ ఉందని వెంటనే ఫోన్ లాక్కోవడం ప్రతి సందర్భంలో సరైన పరిష్కారం కాదు. డిజిటల్ ప్రపంచం పిల్లల భవిష్యత్తులో భాగమే. వారికి టెక్నాలజీని బాధ్యతగా ఉపయోగించడం నేర్పాలి. సమయం నిర్ణయించడం, అవసరమైన కంటెంట్ మాత్రమే చూడడం, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకపోవడం, తెలియని వ్యక్తులతో ఆన్‌లైన్‌లో మాట్లాడకపోవడం, సమస్య ఎదురైతే వెంటనే తల్లిదండ్రులకు చెప్పడం వంటి డిజిటల్ భద్రతా అలవాట్లు నేర్పాలి.

పిల్లలతో ఒప్పందం చేసుకోండి ఇంట్లో పిల్లల వయసుకు అనుగుణంగా సరళమైన నియమాలు పెట్టుకోవచ్చు. ఉదాహరణకు--

-భోజన సమయంలో మొబైల్ వద్దు

-చదువు సమయంలో అవసరమైనప్పుడు మాత్రమే డిజిటల్ పరికరం.

-పడుకునే ముందు స్క్రీన్ సమయాన్ని తగ్గించడం.

-ప్రతిరోజూ కొంత సమయం బయట ఆటలు లేదా శారీరక కార్యకలాపాలకు కేటాయించడం.

-కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయంలో ఫోన్ పక్కన పెట్టడం.

-తల్లిదండ్రుల పర్యవేక్షణలో వయసుకు తగిన కంటెంట్ మాత్రమే చూడడం.

ఇవి శిక్షలు కాకూడదు. కుటుంబంలో అందరూ పాటించే ఆరోగ్యకరమైన నియమాలుగా ఉండాలి.

"మొబైల్ ఇవ్వకపోతే పిల్లాడు తినడు" అనే సమస్యకు ఏం చేయాలి?

పిల్లలు భోజనం చేయడానికి మొబైల్‌ను తప్పనిసరి షరతుగా మార్చుకుంటే, తల్లిదండ్రులు ఒక్కరోజులోనే అలవాటు మార్చాలని ప్రయత్నిం చకుండా క్రమంగా మార్పు తీసుకురావడం మంచిది. భోజన సమయంలో కుటుంబ సభ్యులు కలిసి కూర్చోవడం, పిల్లలతో మాట్లాడటం, ఆహారంపై ఆసక్తి కలిగించడం వంటి పద్ధతులను ప్రయత్నించవచ్చు. పిల్లల తినే అలవాట్లపై నిరంతర ఆందోళన ఉంటే, వారి వయస్సు మరియు ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా అర్హత కలిగిన వైద్య నిపుణుడి సలహా తీసుకోవడం మంచిది. తల్లిదండ్రులు పిల్లలకు సమయం ఇవ్వాలి .పిల్లలకు ఖరీదైన బొమ్మలు, ఖరీదైన ఫోన్లు ఇవ్వడం కంటే తల్లిదండ్రుల సమయం ఎంతో విలువైనది. రోజులో కొంత సమయం పిల్లలతో మాట్లాడటం.. వారితో కలిసి ఆడటం.. వారి కథలు వినడం.. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పడం.. వారితో కలిసి పుస్తకం చదవడం..ఇలాంటి చిన్న చిన్న పనులు పిల్లలకు మొబైల్ కంటే మంచి ప్రత్యామ్నాయంగా మారవచ్చు. టెక్నాలజీ శత్రువు కాదు.. దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామనేదే ముఖ్యం డిజిటల్ టెక్నాలజీ మన జీవితాల్లో తప్పనిసరి భాగంగా మారిపోయింది. విద్య నుంచి ఉద్యోగం వరకు ప్రతి రంగంలో మొబైల్, ఇంటర్నెట్ అవసరం పెరిగింది. అందుకే పిల్లలను టెక్నాలజీకి దూరంగా ఉంచడం కంటే, టెక్నాలజీకి బానిస కాకుండా దాన్ని ఉపయోగించడం నేర్పడం అవసరం. మొబైల్ మన చేతిలో ఉండాలి.. మన జీవితం మొబైల్ చేతిలో ఉండకూడదు. తల్లిదండ్రులు గమనించాల్సిన విషయం పిల్లలు మొబైల్ కోసం పదేపదే అడగడం మాత్రమే సమస్య కాదు. మొబైల్ వినియోగం వల్ల వారి రోజువారీ జీవితం గణనీయంగా దెబ్బతింటోందా అనేది గమనించాలి. చదువు, నిద్ర, కుటుంబ సంబంధాలు, స్నేహాలు, శారీరక కార్యకలాపాలు లేదా ఇతర ముఖ్యమైన పనులపై ప్రభావం పడుతున్నట్లు కనిపిస్తే తల్లిదండ్రులు దాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. అవసరమైతే పాఠశాల కౌన్సిలర్ లేదా అర్హత కలిగిన నిపుణుడి సహాయం తీసుకోవాలి. పాఠశాలలు కూడా అవగాహన కల్పించాలి పిల్లలకు డిజిటల్ పరికరాల సరైన వినియోగంపై పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. స్క్రీన్ వినియోగం, ఆన్‌లైన్ భద్రత, సైబర్‌బుల్లీయింగ్, వ్యక్తిగత సమాచార రక్షణ, సమతుల్య జీవనశైలి వంటి అంశాలపై వయసుకు తగిన విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులకు కూడా పాఠశాలలు మార్గదర్శక సమావేశాలు నిర్వహిస్తే మరింత ప్రయోజనం ఉంటుంది. పిల్లల బాల్యాన్ని తిరిగి తెచ్చుకుందాం పిల్లల చేతిలో మొబైల్ ఉండటం తప్పు కాదు. కానీ పిల్లల బాల్యం మొత్తం మొబైల్ స్క్రీన్‌లోనే గడవడం మాత్రం ఆలోచించాల్సిన విషయం. పిల్లలకు పుస్తకం కావాలి. ఆట కావాలి. స్నేహితులు కావాలి. కుటుంబంతో సమయం కావాలి. ప్రకృతితో అనుబంధం కావాలి. కలలు కనడానికి సమయం కావాలి. మొబైల్ కూడా ఉండొచ్చు.. కానీ జీవితమంతా మొబైల్ కాకూడదు. ముగింపు "మొబైల్ ఇస్తేనే అన్నం తింటాను.. మొబైల్ ఇస్తేనే చదువుతాను.. మొబైల్ ఇస్తేనే పని చేస్తాను" అనే పరిస్థితి ఒక్కసారిగా ఏర్పడదు. చిన్న చిన్న అలవాట్లు క్రమంగా పెద్ద అలవాట్లుగా మారుతాయి. అందుకే పిల్లలను నిందించడం కంటే కుటుంబం మొత్తం కలిసి ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లు ఏర్పరచుకోవాలి. టెక్నాలజీ మన జీవితాన్ని సులభతరం చేయాలి.. మన జీవితాన్ని నియంత్రిం చకూడదు. పిల్లల చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండొచ్చు.. కానీ వారి భవిష్యత్తును స్మార్ట్‌ఫోన్ నిర్ణయించకూడదు. మొబైల్ మనిషి కోసం.. మనిషి మొబైల్ కోసం కాదు. ఇది ప్రతి తల్లిదండ్రి గుర్తుంచుకోవాల్సిన విషయం.

# మసీదుబండ 100 ఫీట్ల రోడ్డు విస్తరణకు మార్గం సుగమం





( ఆగస్టు - 11- హంస కలంవార్త )

స్థలాలు కోల్పోతున్న వారికి అంగీకార పత్రాలు అందజేసిన పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదుబండలో 100 ఫీట్ల రోడ్డు విస్తరణకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. మాదాపూర్‌లోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ, చీఫ్ సిటీ ప్లానర్ వెంకన్న, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్‌లతో కలిసి రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలు కోల్పోతున్న వారికి అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ మసీదుబండ రోడ్డు విస్తరణ మాస్టర్ ప్లాన్‌లో 120 మీటర్లుగా ఉన్నప్పటికీ, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తన ప్రత్యేక చొరవతో 100 ఫీట్ల రోడ్డు విస్తరణకు గ్రామస్థులు అంగీకరించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. స్థలాలు కోల్పోతున్న వారితో చర్చించి, వారి సమస్యలను తెలుసుకుని, స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు సహకరించేలా ఒప్పిం చడం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలు, భవనాలు కోల్పోతున్న వారికి సముచిత న్యాయం జరగాలని గాంధీ అధికారులను కోరారు. జీవనాధారాన్ని కోల్పోయే పరిస్థితి ఉన్నం దున బాధితులందరికీ నిబంధనల ప్రకారం టిడిఆర్ అందేలా చర్యలు తీసుకోవాలని, ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మసీదుబండ రోడ్డు విస్తరణ సమస్యకు నేటితో శాశ్వత పరిష్కారం లభించే పరిస్థితి ఏర్పడిందన్నారు. 100 ఫీట్ల రోడ్డు పూర్తయితే మసీదుబండతో పాటు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గి, ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజ కవర్గంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రోడ్ల విస్తరణతో పాటు ప్రత్యామ్నాయ రహదారులు, లింక్ రోడ్ల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని గాంధీ సూచించారు. రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఏసీబీ శైలజ, ఏసీబీ అక్బర్, మసీదుబండ ప్రాంత వాసులు తదితరులు పాల్గొ న్నారు.

# గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో బండి రమేష్ భేటీ





( ఆగస్టు -11- హంస కలంవార్త)

ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, పార్టీ బలోపేతం, రానున్న కార్పొరేషన్ ఎన్నికలపై కీలక చర్చ : అధిష్టానం పిలుపు మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ గారు మంగళవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, తెలంగాణ రాష్ట్ర ఎస్ ఐ ఆర్ ఇన్‌చార్జ్ గంప వేణుగోపాల్ గార్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పరిస్థితులు, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ సన్నద్ధత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కీలకంగా పనిచేశారని బండి రమేష్ వివరించారు. ముఖ్యంగా కూకట్‌పల్లి నియోజ కవర్గంలో బూత్ స్థాయి నుంచి పార్టీ యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ, ప్రతి బూత్‌కు బి ఎల్ ఎ లను నియమించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండేలా బిఎల్ఎ వ్యవస్థను బలోపేతం చేశామని బండి రమేష్ తెలిపారు. ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు ఓటర్ల సమస్యలను తెలుసుకోవడానికి, ఓటరు జాబితాలోని అవకతవకలను గుర్తించడానికి బి ఎల్ ఎ వ్యవస్థ ఎంతో ఉపయోగ పడిందని ఆయన పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజ కవర్గంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వ యంతో పనిచేసిన విధానం, ఎదురైన సమస్యలు, ప్రజల నుంచి వచ్చిన స్పందన తదితర అంశాలను బండి రమేష్ ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌కు వివరిం చారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్‌ను పార్టీకి మరింత బలోపేతమైన యూనిట్‌గా తీర్చిదిద్దే ందుకు చేపడుతున్న చర్యలను కూడా వివరించారు. అదేవిధంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్ర మాలపై బండి రమేష్ నివేదికను అందజే శారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడంతో పాటు, అర్హులైన లబ్ధిదా రులకు పథకాల ద్వారా ప్రయోజనం కలిగేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేస్తు న్నాయని పేర్కొన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి చేపడుతున్న కార్యక్రమాలు, నాయకులు, కార్య కర్తలతో నిర్వహిస్తున్న సమన్వయ సమావేశాలు, క్షేత్రస్థాయిలో పార్టీకి ప్రజల నుంచి లభిస్తున్న స్పందన తదితర అంశాలను కూడా సచిన్ సావంత్ దృష్టికి తీసుకెళ్లారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే క్షేత్రస్థాయి కార్యాచరణకు సిద్ధంగా ఉందని బండి రమేష్ తెలిపారు. బూత్ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తు న్నామని బండి రమేష్ తెలిపారు. పార్టీ అధిష్టానం సూచనల మేరకు భవిష్యత్ కార్యక్ర మాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించి రాష్ట్రస్థాయిలో చేపట్టిన చర్యలు, బూత్ స్థాయిలో పార్టీ యంత్రాంగం పనితీరు, రానున్న రోజుల్లో పార్టీ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మరింత చేరువయ్యేలా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు బండి రమేష్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని బండి రమేష్ పేర్కొన్నారు.

## శివలింగాపురంలో పోలీసుల ఆధ్వర్యంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



( ఆగస్టు -11- హంస కలంవార్త)



జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున మణుగూరు పట్టణంలోని శివలింగాపురం ప్రాంతంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేస్తూ పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. 147 వాహనాలకు సంబంధించిన పాత పెండింగ్ చలాన్ల ద్వారా మొత్తం రూ.35 వేల రూపాయలను వసూలు చేశారు. అదేవిధంగా నిబంధనలను ఉల్లంఘిం చిన వారిపై 13 స్పాట్ కేసులు నమోదు చేశారు. సరైన నంబర్ ప్లేట్లు లేని 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్రమంగా తరలిస్తున్న/నిల్వ చేసిన రూ.35వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులను నమోదు చేశారు. అనంతరం శివలింగాపురం కాలనీవాసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఏర్పాటుచేసి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సరైన నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా కాలనీల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను తెలుసుకుని, తగిన ధృవీకరణ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, మణుగూరు సీఐ నాగబాబు, ఏడుల్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు,ఎస్ఐలు, పోలీస్ టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## బోనాల జాతరలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

( ఆగస్టు -11- హంస కలంవార్త)



జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ సర్కిల్‌లో తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు ఎత్తుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాల ఊరేగింపులో పాల్గొని భక్తులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, జగిత్యాలలో మొదటిసారిగా తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల ఆధ్వర్యంలో బోనాల జాతర నిర్వహించడం అభినందనీయమ న్నారు. బోనాలు తెలంగాణ ప్రజలకు కేవలం ఒక పండుగ మాత్రమే కాదని,అది మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలతో ముడిపడిన ఒక ఎమోషన్ అని పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి, జానపద కళలను భావితరాలకు అందించడంలో చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దయ్యాల చంద్రకళ శంకర్, యూట్యూబర్స్, కళాకారులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఢిల్లీలో సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం










( ఆగస్టు-11- హంస కలంవార్త )

పలువురు ప్రముఖులతో కలిసి హాజరైన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఢిల్లీలోని ఇండియన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రత్యేక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన వందలాది మంది పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవ లక్ష్మణ్, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఉత్పల హనుమంతరావు, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్టోబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్న సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ పోస్టర్లను ప్రముఖులు ఆవిష్కరించారు. దేశీయ, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఒకే వేదికపైకి తీసుకురావడం, వివిధ రంగాల్లో పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలను ప్రోత్సహించడం లక్ష్యంగా గ్లోబల్ బిజినెస్ మీట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి, వ్యాపార విస్తరణ, పెట్టుబడుల అవకాశాలు, వివిధ రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాల బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్‌కు పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# బిజినెస్

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు

## బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక




కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో బ్యాంకులు అత్యంత బాధ్యతా యుతంగా వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. 'ఏఐ' వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు సంబంధించి పూర్తి జవాబుదారీతనం బ్యాంకులదేనని, పొరపాటు జరిగినప్పుడు ఏఐ మోడళ్లను నిందించడం ఆమోదయోగ్యం కాదని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం ముంబైలో ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఫైబాక్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదైనా నిర్ణయం విషయంలో అంతిమ బాధ్యత బ్యాంకుదే తప్ప, సేవలు అందించిన వెండార్‌ది, అల్గారిథమ్‌ది కాదని మల్హోత్రా స్పష్టం చేశారు. "ఈ నిర్ణయం తీసుకున్నది మోడల్ అని చెప్పడం సమర్థనీయం కాదు. రెగ్యులేటర్‌గా మేము కానీ, కస్టమర్లు కానీ ఇటువంటి సమాధానాలను ఎప్పటికీ అంగీకరించం" అని ఆయన తేల్చి చెప్పారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా, దానికి అదనపు తోడ్పాటునిచ్చే సాధనంగా మాత్రమే ఏఐని వినియోగించుకోవాలని సూచించారు. ఏఐ అందించే సిఫార్సులను విశ్లేషించగలగడం, అవసరమైనప్పుడు జోక్యం చేసుకుని వాటిని సవరించగలగడం వంటి పటిష్టమైన మానవ పర్యవేక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా ఉండాలని మల్హోత్రా నొక్కిచెప్పారు. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన నిర్దిష్ట ఏఐ విధానాన్ని కలిగి ఉండాలని, థర్డ్-పార్టీల నుంచి సేవలు పొందినప్పటికీ ఫలితాలకు బ్యాంకులే జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు.

## ఎలక్ట్రిక్ టూవీలర్లకు గుడ్‌న్యూస్: సబ్సిడీ గడువు పొడిగింపు

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కొనుగోలుదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'పీఎం ఎలక్ట్రిక్ డ్రైవ్ రివల్యూషన్ ఇన్ ఇన్నోవేటివ్ వెహికల్ ఎన్‌హాన్స్‌మెంట్' (పీఎం ఈ-డ్రైవ్) పథకం కింద అందిస్తున్న కొనుగోలు ప్రోత్సాహకాలను 2028 మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. అదే సమయంలో ద్విచక్ర వాహన విభాగానికి కేటాయించే నిధులను కూడా భారీగా పెంచింది. ఈ మేరకు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆగస్టు 10న అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. సవరించిన నిబంధనల ప్రకారం, 2025 ఏప్రిల్ 1 నుంచి 2028 మార్చి 31 మధ్య విక్రయించే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు బ్యాటరీ సామర్థ్యం ఆధారంగా కిలోవాట్ అవర్‌కు రూ. 2,500 చొప్పున ప్రోత్సాహకం లభిస్తుంది. అయితే, ఒక్కో వాహనంపై గరిష్ఠంగా రూ.5,000 వరకు మాత్రమే రాయితీని పరిమితం చేశారు. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రోత్సాహకం కిలోవాట్ అవర్‌కు రూ. 5,000 ఉండగా, గరిష్ఠ పరిమితి రూ. 10,000గా ఉంది. కేవలం రూ. 1.5 లక్షల ఎక్స్-ఫ్యాక్టరీ ధర లోపు ఉన్న వాహనాలకు మాత్రమే ఈ సబ్సిడీ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజా నిర్ణయంతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగానికి కేటాయించిన నిధులు రూ. 1,772 కోట్ల నుంచి రూ. 2,767 కోట్లకు పెరిగాయి. ఈ నిధుల ద్వారా సుమారు 45.79 లక్షల రిజిస్టర్డ్ ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా. పథకం మొత్తం కేటాయి ంపులు కూడా రూ. 11,900 కోట్లకు చేరాయి. రాయితీ క్లెయిమ్‌లు దాఖలు చేయడానికి 2027 డిసెంబర్ 31ని తుది గడువుగా నిర్ణయించారు. అయితే, కేటాయించిన నిధులు నిర్ణీత గడువు కంటే ముందే ఖర్చయితే, ఆ తర్వాత ఎటువంటి క్లెయిమ్ లను స్వీకరించబోమని ప్రభుత్వం వెల్లడించింది. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా 2024 సెప్టెంబర్‌లో పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని ప్రారంభి ంచారు. ఈ పథకం గడువును, నిధులను పెంచాలని ఇటీవల రాజ్యసభ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్రం నిర్ణయంతో ఏథర్ ఎనర్జీ, ఓలా ఎలక్ట్రిక్ వంటి కంపెనీల షేర్లు లాభాల్లో పయనించాయి. ఈ పొడిగి ంపు అటు తయారీదా రులకు, ఇటు కొనుగో లుదారులకు దీర్ఘకాలిక భరోసా కల్పిస్తుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.



## 1601 నంబరు సిరీస్




**న్యూఢిల్లీ:** అవాం ఛిత కాల్స్‌ను కట్టడి చేసే చర్యల్లో భాగంగా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎ?ఫఎ?సఐ), ప్రభుత్వ రంగాలు కాకుండా ఇతర రంగాల సంస్థలు చేసే లావాదేవీ, సేవా సంబంధిత కాల్స్ కోసం ప్రత్యేకంగా 1601 నంబరు సిర?సను వాడాలని సోమవారం ఆదేశించింది. ఈ మేరకు తొలి దశలో యుటిలిటీస్ (వినియోగ సేవలు), కొరియర్, లాజిస్టిక్స్ రంగాల సంస్థల సర్వీస్, లావాదేవీ కాల్స్‌ను 1601 నంబరు సిరీస్ పరిధిలోకి తీసుకువస్తున్నట్టు తెలిపింది. అయితే ఈ సిరీస్‌ను ఏ సంస్థ కూడా ప్రచార సంబంధిత వాయిస్ కాల్స్ కోసం వాడరాదని స్పష్టం చేసింది. ప్రస్తుతం బీఎ?ఫఎ?సఐ రంగంతోపాటు ప్రభుత్వ సంస్థల సర్వీసు, లావాదేవీ కాల్స్ కోసం 1600 సిరీస్ నంబర్లను కేటాయిం చారు. ఈ సంస్థల కమ్యూ నికేషన్లు చాలా కీలకమైనవి, సున్నితమైనవి కావడంతో వాటికి సంబం ధించిన ముఖ్యమైన లావా దేవీల కాల్స్ ఇతర రంగాల సేవా కాల్స్‌తో కలిసి పోకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఇతర రంగాల కోసం ప్రత్యేకంగా 1601 సిర?సను జారీ చేసినట్టు ట్రాయ్ పేర్కొంది. బీఎ? ఫఎ?సఐ సంస్థలు 1600 సిర?సను విస్తృతంగా వాడిన అనుభవం ఆధారంగా ఇతర రంగాలకు కూడా అదే తరహా నంబరింగ్ విధానాన్ని విస్తరిం చాలని ట్రాయ్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బీఎఫ్ఎ?సఐ, ప్రభుత్వ రంగాలు కాకుండా ఇతర రంగాల సంస్థలు చేసే కాల్స్ కోసం టెలికాం శాఖ కేటాయించిన 1601 సిరీస్‌ను దశల వారీగా అమలుకు శ్రీకారం చుట్టినట్టు ట్రాయ్ తెలిపింది.

## శ్రీలంకకు షాకిచ్చేందుకు గిల్-గంభీర్ మాస్టర్‌ప్లాన్

## ప్రాక్టీస్‌లోనే ప్రణాళికలు అమలు!

శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టు.. స్పిన్‌తో పాటు పేసర్ల నుంచి ఎదురయ్యే ముప్పుపైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాచ్‌లో ఎదురయ్యే పరిస్థితులకు తగ్గట్టుగా ప్రాక్టీస్ చేయాలని భావించింది. ఎన్‌సీసీ మైదానంలో ప్రాక్టీస్ కోసం ఉపయోగించిన పిచ్‌ను.. శ్రీలంక 'ఎలెవన్'తో జరిగిన వార్మప్ మ్యాచ్ పిచ్ తరహాలో సిద్ధం చేయాలని గ్రౌండ్ సిబ్బందికి సూచించింది. పిచ్‌పై పగుళ్లు వచ్చేలా చేసి.. నాలుగో రోజు వికెట్‌ను పోలిన పరిస్థితులు కల్పించారు. బంతి రివర్స్ స్వింగ్ అయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని భారత బ్యాటర్లు ఫుట్‌వర్క్‌పై ప్రత్యేకంగా సాధన చేశారు. నెట్ సెషన్‌లో గిల్ ముగ్గురు త్రో-డౌన్ నిపుణుల నుంచి బంతులు ఎదుర్కొన్నాడు. పాత, కొత్త కూకాబుర్రా బంతులతో రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేలా సాధన చేశాడు. అనంతరం అకీబ్ నబీ నుంచి సెమీ-ఓల్డ్ బంతులతో బౌలింగ్ చేయించుకుని మరింత ప్రాక్టీస్ చేశాడు. గాలె పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూ లంగా ఉంటుందని భావిస్తున్నారు. అయితే శ్రీలంక మైదానాల్లో బంతి త్వరగా పాతబడు తుందని.. దీంతో రివర్స్ స్వింగ్ కీలకంగా మారొచ్చని టీమ్ మేనేజ్‌మెంట్ అంచనా వేసింది. భారత్ ఇప్పటికే శ్రీలంక 'ఎలెవన్'పై మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడింది. శ్రీలంక మాత్రం ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడకుండానే సిరీస్‌లోకి దిగుతోందని మాజీ పేసర్ ఫర్వీజ్ మహరూఫ్ తెలిపారు. భారత బ్యాటింగ్‌పై సందేహాలు ఉన్నా.. సిరీస్‌కు ఆతిథ్య జట్టు కంటే భారత్ మెరుగ్గా సిద్ధమైందని ఆయన అభిప్రాయపడ్డారు.




## భారత ఆటగాళ్లను 'చీటర్స్' అన్న సంగక్కర- ఏళ్ల తర్వాత బయటపెట్టిన ఇర్ఫాన్ పఠాన్

టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్, శ్రీలంక క్రికెట్ దిగ్గజం కుమార సంగక్కర మధ్య మైదానంలో జరిగిన ఓ తీవ్ర వాగ్వాదాన్ని ఏళ్ల తర్వాత బయటపెట్టాడు. 2005లో జరిగిన ఓ టెస్ట్ మ్యాచ్‌లో సంగక్కర తనను, భారత ఆటగాళ్లను 'మోసగాళ్లు (చీటర్స్)' అని పిలుస్తూ వ్యక్తిగత దూషణలకు దిగాడని పఠాన్ సంచలన విషయాలు వెల్లడించాడు. అయితే, ఆ తర్వాత ఐపీఎల్ పుణ్యమా అని ఇద్దరూ మళ్లీ కలిసిపోయి మంచి స్నేహితులుగా మారినట్లు కూడా తెలిపాడు.

**-అసలేం జరిగిందంటే..!**

2005లో శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఢిల్లీలో జరిగిన రెండో టెస్టులో ఈ ఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ మధ్యలో బంతుల బాక్సును మార్చడంపై శ్రీలంక ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ముఖ్యంగా సంగక్కర దీనిపై చాలా ఆగ్రహంగా ఉన్నాడు. అదే సమయంలో జట్టు యాజమాన్యం కోరిక మేరకు ఇర్ఫాన్ పఠాన్ ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగాడు. ఈ వివాదం గురించి తనకు ఏమాత్రం తెలియదని పఠాన్ పేర్కొన్నాడు. "నేను ఓపెనర్‌గా బరిలోకి దిగి 93 పరుగులు చేశాను. ఆ ఇన్నింగ్స్‌లో ముత్తయ్య మురళీధరన్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు కొట్టాను. కొత్త బంతితో మురళీధరన్‌ను సిక్సర్లు కొట్టడమంటే ప్రత్యర్థి ప్రణాళికలను దెబ్బతీసినట్లే. అది చూసి సంగక్కర అకస్మాత్తుగా స్లెడ్జింగ్ మొదలు పెట్టాడు. 'మీరు మోసగాళ్లు, మీ తల్లిదండ్రులు మీకు ఇవే నేర్పిస్తారా' అంటూ వ్యక్తిగత దూషణలకు దిగాడు. అతను వ్యక్తిగతంగా మాట్లాడటంతో నేను కూడా గట్టిగానే సమాధానం ఇచ్చాను. కానీ, గొడవ మొదలుపెట్టింది అతనే" అని పఠాన్ ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నాడు.



# స్పోర్ట్స్

## లైంగిక దాడి ఆరోపణలు

## ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్




ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడుతున్న బెంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్ అయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడని, బెదిరింపులకు గురిచేశాడని ఓ మెడికల్ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కలకత్తా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. హూగ్లీ రూరల్ ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. డమ్ డమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇమామీ సిటీలో అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఓ మెడికల్ విద్యార్థిని అభిషేక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత మూడేళ్లుగా తాము రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, గత ఏడాది నుంచి అభిషేక్ తనను దూరం పెడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి పలుమార్లు లైంగిక సంబంధం పెట్టుకున్నాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని బాధితురాలు ఆరోపించింది. అంతేకాకుండా తనపై దాడి చేసి, తీవ్రంగా బెదిరించాడని కూడా ఫిర్యాదులో తెలిపింది. ఈ కేసులో అభిషేక్‌ను అరెస్ట్ చేయాలని కలకత్తా హైకోర్టు పోలీసులను ఆదేశించింది. గతంలో అభిషేక్ ఈ ఆరోపణలన్నింటినీ ఖండించాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన పోరెల్, 2023 నుంచి ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. బెంగాల్ తరఫున ఫస్ట్-క్లాస్, లిస్ట్ ఏ మ్యాచ్‌లతో పాటు ఇండియా-ఏ జట్టు తరఫున కూడా ఆడాడు.

హంస కలం వార్త HAMSA KALAM VARTA
బుధవారం 12 ఆగష్టు 2026

## ఉదయనిధి వ్యాఖ్యల దుమారం.. త్రిష వరుస పోస్టులు వైరల్!



తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో నటి త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై ఆమె నేరుగా స్పందించకపోయినా.. వరుస పోస్టులతో పరోక్షంగా ఆయనకు సమాధానం ఇచ్చారా? అనే చర్చ మొదలైంది. తన అమ్మమ్మ 98వ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫొటోలను త్రిష ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంది. వాటితో పాటు కొన్ని సందేశాలను కూడా షేర్ చేసింది. "ఈ వయసులోనూ డ్రామాలు చేయడం ఏంటి? నీ పని నువ్వు చూసుకో.. డబ్బు సంపాదించుకో.. ప్రశాంతంగా ఉండు" అంటూ ఉన్న పోస్ట్‌ను పంచుకుంది. దానికి కనుబొమ్మ పైకెత్తిన ఎమోజీని జత చేసింది. మరో సందేశంలో "మీరు చేసే ప్రతి పనీ తిరిగి మీ దగ్గరకే వస్తుంది. మంచిగా ఉండండి.. మంచే చేయండి" అని ఉంది. "ఇకపై మీకు అన్నీ సవ్యంగా జరిగే అధ్యాయం మొదలైంది" అనే మరో సందేశాన్ని కూడా ఆమె పంచుకుంది. "రిస్క్ తీసుకునేవారే గెలుస్తారు" వంటి సందేశాలు కూడా ఉన్నాయి. "ఒకప్పుడు కోరుకున్న జీవితంతో ఇప్పుడు ఉక్కిరిబిక్కిరవడం ఎంత గొప్ప అదృష్టం" అంటూ మరో పోస్ట్‌ను త్రిష షేర్ చేసింది. అయితే ఈ పోస్టులన్నీ ఉదయనిధిని ఉద్దేశించేనా? అన్న దానిపై ఆమె స్పష్టత ఇవ్వలేదు.



ఇటీవల కావేరీ జలాల అంశంపై తంజావూరులో జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఉదయనిధి ప్రసంగించారు. ఈ సందర్భంగా త్రిష పేరుతో నినాదాలు రావడంతో ఆయన చేసిన వ్యాఖ్య వివాదాస్పదమైంది. దీనిపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో త్రిష తాజా పోస్టులు చర్చనీయాంశంగా మారాయి.

## ఆయనో నక్క.. నేను మాత్రం విశ్వాసమున్న కుక్కను: కంగనా ఘాటు వ్యాఖ్యలు!



బాలీవుడ్ నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్, ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ దేశంలో తింటూ, పొరుగు దేశం కోసం పోరాడతారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖుల మౌనం గురించి గతంలో నసీరుద్దీన్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వివాదం మరోసారి రాజుకుంది. ఇటీవల నటుడు పియూష్ మిశ్రా, నసీరుద్దీన్ షా వ్యాఖ్యలను ప్రస్తావించిన ఓ వార్తను కంగనా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా నసీరుద్దీన్‌ను ఉద్దేశిస్తూ.. "నిజం చెప్పాలంటే ప్రతి ఒక్కరూ ఎవరో ఒకరికి కుక్కలే. కానీ, నేను ఏ ఇంటి (దేశం) రొట్టె తింటున్నానో, ఆ ఇంటికి కాపలా కాస్తున్నందుకు, దాని కోసం పోరాడుతున్నందుకు గర్వపడుతున్నాను. నసీర్ సాబ్ ఈ దేశపు తిండి తింటారు. కానీ, పొరుగు దేశం కోసం పోరాడతారు" అని కంగనా రాసుకొచ్చారు. ఆయన్ను ఓ 'నక్క' (లోమ్డీ) అని అభివర్ణించిన కంగనా, తాను మాత్రం విశ్వాసపాత్రమైన కుక్కగా ఉండటానికే ఇష్టపడతానని స్పష్టం చేశారు. గతంలో విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించినప్పుడు నసీరుద్దీన్ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "నోట్లో ఎముక ఉన్న కుక్క మొరగదు. ఆ ఎముక కిందపడగానే లేదా పళ్లు విరగ్గొట్టగానే అప్పుడు మొరుగుతుంది" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పియూష్ మిశ్రా మాట్లాడుతూ, షా వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇప్పుడు ఏ 'కుక్కలు' మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. ఈ వార్తను షేర్ చేస్తూనే కంగనా నసీరుద్దీన్‌పై విరుచుకుపడ్డారు. గతంలో కూడా కంగనా విద్యార్థుల ఉద్యమాలను విమర్శిస్తూ, యువతలో ఒక వర్గాన్ని 'గట్టర్ చాప్' అని సంబోధించి వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే.



# వివాదంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్

## యువతి ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రముఖ గాయకుడు, బిగ్‌బాస్ విజేత రాహుల్ సిప్లిగంజ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. 'నాటు నాటు' పాటతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఆయనపై విశాఖపట్నంలో కేసు నమోదైంది. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విశాఖకు చెందిన ఓ యువతి ఫిర్యాదు ప్రకారం.. కర్పూరపు రాహుల్ రెడ్డి అనే వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, వ్యక్తిగత ఫొటోలు వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కూడా జోక్యం చేసుకున్నారని యువతి ఆరోపించారు. రాహుల్ రెడ్డికి బంధువనని చెప్పి, తనను బెదిరించారని, బలవంతంగా కొన్ని వీడియో స్టేట్‌మెంట్లు ఇప్పించారని ఆమె తన ఫిర్యాదులో వివరించారు. యువతి ఫిర్యాదుతో రాహుల్ సిప్లిగంజ్‌తో సహా మొత్తం 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో మధ్యవర్తిత్వం చేసిన కొందరు జర్నలిస్టులు, హైకోర్టు న్యాయవాది గీతా ప్రసన్న చందన కూడా ఉన్నట్లు సమాచారం. తొలుత ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, తదుపరి విచారణ నిమిత్తం దీనిని ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై రాహుల్ సిప్లిగంజ్ నుంచి గానీ, ఆయన ప్రతినిధుల నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



## 'హృదయం మురళి' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!

అధర్వ హీరోగా రూపొందిన సినిమానే 'ఇదయం మురళి' (హృదయం మురళి). అధర్వ తండ్రి మురళి హీరోగా 1991లో 'ఇదయం' (హృదయం) సినిమా చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆ సినిమా మ్యూజికల్ హిట్ గా యూత్ ను ఒక ఊపు ఊపేసింది. ఆ సినిమా పేరును .. తండ్రి పేరును కలుపుతూ, ఆయనను గుర్తుచేస్తూ అధర్వ ఈ సినిమా చేశాడనుకోవాలి. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, జులై 10వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ నెల 7వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో తెలుగులోను స్ట్రీమింగ్ అవుతోంది. 'హృదయ' (అధర్వ) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోతాడు. అప్పటి నుంచి మేనమామ (నట్టి సుబ్రమణ్యం) అతని ఆలనాపాలన చూస్తూ వస్తాడు. అయితే తల్లిదండ్రులు లేని కారణంగా ఒక రకమైన బెరుకు 'హృదయ'లో ఉండిపోతుంది. ఆ కారణంగా అతను తన మనసులోని మాటను బయటికి చెప్పలేకపోతుంటాడు. కాలేజ్ లో చదువుకునే రోజులలో అతను 'సమంత' (ప్రీతి ముకుందన్)ను ప్రేమిస్తాడు. కానీ ఆ ప్రేమను మనసులోనే దాచుకుంటాడు. ఆ తరువాత చదువు పూర్తి చేసి చెన్నైలో జాబ్ కోసం సెర్చ్ చేస్తూ ఉంటాడు. ఆ సమయంలోనే అతనికి 'అముద' (కయాదు లోహార్) పరిచయమవుతుంది. డాక్టర్ గా ఉన్న ఆమెను అతను ఆరాధించడం మొదలుపెడతాడు. ఆమె పట్ల ఉన్న ప్రేమను వ్యక్తం చేయమని స్నేహితులు ఎంతగా చెప్పినా, హృదయ ధైర్యం చేయలేకపోతాడు. ఆమె తన ఊరికి వెళ్లిపోవడంతో దిగాలు పడిపోతాడు. సమంతకుగానీ .. అముదకుగాని తన మనసులోని ప్రేమను చెబితే బాగుండునని అనుకుంటాడు. 'అదితి'తో హృదయ ఎంగేజ్ మెంట్ జరిగిన తరువాత వాళ్లిద్దరూ తారసపడతారు. అప్పుడు అతను ఏం చేస్తాడు? అనేదే కథ.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449